మన్యం వదిలి జనావాసాల్లోకి..!

గ్రామాల్లో పెరిగిన కోతుల బెడద
- విచ్చలవిడిగా దాడి చేస్తున్న వైనం
- రెండు నెలల వ్యవధిలో 45 మందికి గాయాలు
- హడలెత్తుతున్న మండల ప్రజలు
- చోద్యం చూస్తున్న పాలకులు, అధికారులు


పాలడుగు సమీపంలో కోతుల గుంపు (ఇన్‌సెట్) కోతుల దాడితో వృద్ధురాలి కాలిపై గాయం (ఫైల్)

అడవులు అంతరిస్తున్న నేపథ్యాన కోతులు అడవులను వదిలి జనావాసాలలో సంచరిస్తున్నాయి. గ్రామాల్లో కోతులు గుంపులు గుంపులుగా తిరుగుతుండడంతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. ఇళ్లలోకి వచ్చి తినుబండారాలు, ఆహార పదార్థాలను ఎత్తుకెళ్తుండడంతో వాటిని తరిమే ప్రయత్నంలో తిరిగి దాడి చేసి గాయపరుస్తున్నాయి. గతంలో కోతులు తరిమేందుకు గ్రామ కమిటీలు వేసుకొని వాటిని పట్టుకొని అడువుల్లో వదిలేయడమే కాకుండా కొండముచ్చులను గ్రామాల్లో తిప్పుతూ తరిమినా ఫలితం లేకుండాపోతోంది.

వైరారూరల్: వైరా మండలం నారపునేనిపల్లి, విప్పలమడక, రెబ్బవరం, సిరిపురం, గొల్లపూడి, పాలడుగు తదితర గ్రామాల్లో కోతుల బెడద తీవ్రంగా ఉంది. దీంతో పొద్దున లేచిన దగ్గర నుంచి సాయంత్రం చీకటి పడేవరకు ఇళ్లు, దుకాణాల్లోకి కోతులు జొరబడి ఆహార పదార్థాలను ఎత్తుకెళ్తుండడంతో పొద్దస్తమానం తలుపులు వేసుకొని ఉండాల్సి వస్తోంది. గ్రామాల్లో నానాటికి కోతుల సంతతి బాగా పెరిగిపోతున్నదని, వాటి నుంచి తప్పించుకోవడానికి నానా అగచాట్లు పడాల్సి వస్తుందని ప్రజలు వాపోతున్నారు.

ఇళ్లు, పొలాలు నాశనం..
కోతులు ఇంటి పైరేకులు, పెంకులు నాశనం చేస్తూ నానా హంగామా సృష్టిస్తున్నాయి. ఇంటి ఆవరణలో ఉన్న పండ్ల చెట్లు, కూరగాయలను సైతం వదిలిపెట్టడం లేదు. అంతేకాక చెరుకు, మొక్కజొన్న తదితర పంటల్లో కోతులు గుంపులుగా తిరుగుతూ పంటల ఆకులు, కాయలు తుంచేస్తుండడంతో రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారు. కోతుల బారీ నుంచి పంటలను కాపాడుకునేందుకు ఓవైపు దినసరి కూలీలను పంట పొలాల వద్ద కాపాల ఉంచడం మరోవైపు కొండముచ్చు, ఎలుగుబంటి వేషధారణలో ఉండే వస్త్రాలను కొనుగోలు చేసి కోతులను తరిమికొట్టి రైతులు పంటలను కాపాడుకుంటున్నారు.

ఖాళీ ఇళ్లే నివాసాలుగా..
అడవుల్లోని చెట్ల కొమ్మలపై ఆడుతూ సంచరించాల్సిన కోతులు అడవులు అంతరించిన నేపథ్యాన మన్యం వదిలి జనవాసాల్లోకి ప్రవేశించాయి. గ్రామాల్లోని భారీ వృక్షాలు, ఎవరు నివాసించకుండా ఖాళీగా ఉండే ఇళ్లను వాటి ప్రవాస కేంద్రాలుగా ఏర్పాటు చేసుకొని సంచరిస్తున్నాయి. రాత్రంతా భారీ వృక్షాలపై ఉండి తెల్లవారితే ఆహారం కోసం ఇళ్లల్లోకి ప్రవేశిస్తున్నాయి. అంతేకాక గుంపులు గుంపులుగా సంచరిస్తూ ఇంట్లో నుంచి ఎవరిని బయటకు రాకుండా చేస్తున్నాయి. రహదారులపై కూరగాయలు, సరుకులు తదితర సామగ్రి తీసుకొని వెళ్తున్న పాదచారులు, ద్విచక్రవాహనదారులపై దాడి చేస్తున్న నేపథ్యాన పలువురు గాయాలపాలవుతున్నారు.

పట్టించుకోని పాలకులు..
కోతుల మంద ఒక్కసారిగా ఇళ్లలోకి వచ్చి దాడి చేసి గాయపరుస్తున్న నేపథ్యాన ప్రజలు బెంబేలెత్తుతున్నారు. జూన్, జూలైలో కోతుల దాడిలో 46 మంది గాయపడి వైరా ప్రభుత్వాస్పత్రిలో చికిత్స చేయించుకోగా.. ఇటీవల నారపునేనిపల్లి గ్రామంలో పదిహేను మందిని గాయపరిచాయి. ఇంత జరుగుతున్నా.. పాలకవర్గం, అధికారులు తమకేమి పట్టనట్లు వ్యవహరిస్తున్నారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా కోతుల నియంత్రణపై దృష్టి సారించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

కోతుల సంతతి పెరిగింది..

నారపునేనిపల్లి గ్రామంలో కోతుల సంతతి బాగా పెరిగింది. వీధిల్లో వెళ్తున్న వారిపై గుంపులుగా దాడి చేస్తున్నాయి. ఇటీవల చాలా మందిపై దాడి చేసి గాయపరిచాయి. అయినా పంచాయతీ పాలకవర్గం, అధికారులు మాత్రం తమకేమి పట్టనట్లు వ్యవహరిస్తున్నారు.

– బల్నుపాటి కోటయ్య, నారపునేనిపల్లి

రెండు సార్లు దాడి చేశాయి..

నారపునేనిపల్లిలో భారీ చెట్లతో ఒక ఇళ్లు ఖాళీగా ఉంది. రాత్రి వేళ ఆ ఇళ్లు, చెట్లపై నిద్రించి తెల్లారగానే ఆహారం కోసం ఇళ్లల్లోకి వస్తున్నాయి. ఈనేపథ్యంలో అదిలించే ప్రయత్నం చేస్తే దాడులు చేస్తున్నాయి. ఇప్పటికే నా మీద రెండు సార్లు దాడి చేసి గాయపరిచాయి.

– శీలం సరోజిని, నారపునేనిపల్లి

క్లుప్తంగా

బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన

బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న జెడ్పీ చైర్మన్ కమల్‌రాజ్

మధిర: మండలంలోని రొంపిమళ్ల గ్రామస్తులు పంటపొలాలకు వెళ్లాలంటే యండపల్లి గుట్ట దగ్గర ఉన్న వాగును దాటిపోవాలి. వాగును దాటలేక ఇబ్బందులు పడుతున్న విషయానిన గ్రామస్తులు జెడ్పీచైర్మన్ లింగాల కమల్‌రాజ్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన జిల్లా పరిషత్ నుంచి వాగుపై బ్రిడ్జి నిర్మించడానికి నిధులు మంజూరు చేయించి శంకుస్థాపన చేశారు. అదే విధంగా రొంపిమళ్ల, మల్లవరం గ్రామాల్లో నిర్మించిన సీసీ రోడ్లను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రావూరి శ్రీనివాసరావు, నాయకులు భాస్కర్ రెడ్డి, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

నోట్ పుస్తకాలు పంపిణీ
తల్లాడ: మండలంలోని అన్నారుగూడెం, నిమ్మగూడెం పాఠశాలల్లో చదువుతున్న 160 మంది విద్యార్థులకు మై ఫ్రెండ్స్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో బుధవారం 600 నోట్ పుస్తకాలను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ పుస్తకాలను తల్లాడ ఎంపీపీ దొడ్డా శ్రీనివాసరావు అందించారు. కార్యక్రమంలో అన్నారుగూడెం సర్పంచ్ మమత, ఎంపీటీసీ గోవింద్ విజయలక్ష్మి, ఉప సర్పంచ్ గోవింద్ భాగ్యమ్మ, హెచ్‌ఎం రమేష్, సరోజినీ, పి.వెంకటేశ్వరరావు, మాదినేని నరసింహారావు, పులి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

మాజీ ప్రధాని వాజ్‌పేయి సేవలు మరువలేనివి

అటల్‌బిహారి వాజ్‌పేయి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న రామలింగేశ్వరరావు

సత్తుపల్లి: భారత ప్రధానిగా దేశాన్ని అభివృద్ధిలో ముందుకు తీసుకెళ్లిన మాజీ ప్రధాని అటల్‌బిహార్ వాజ్‌పేయి సేవలు మరువలేనివని బీజేపీ ఖమ్మం పార్లమెంట్ కన్వీనర్ నంబూరి రామలింగేశ్వరరావు అన్నారు. బుధవారం ఆయన వర్ధంతి కార్యక్రమాన్ని స్థానిక బీజేపీ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి జిల్లా ఎస్సీ మోర్చా కార్యదర్శి చిన్నకృష్ణతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన చేసిన సేవలను కొనియాడారు. అనంతరం సత్తుపల్లి ప్రభుత్వాస్పత్రిలో బాలింతలకు పండ్లు, బ్రెడ్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల, పట్టణ అధ్యక్షులు పాలకొల్లు శ్రీనివాస్, ఆచంట నాగస్వామి, జిల్లా కార్యదర్శి మిశ్రా, కృష్ణయ్య పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు

విద్యార్థినికి ప్రథమ బహుమతిగా చెక్కు అందజేస్తున్న దృశ్యం

సత్తుపల్లిటౌన్: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని సత్తుపల్లి పాతసెంటర్ జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాల మెరిట్ విద్యార్థులకు రూ.47,500 ప్రోత్సాహకంగా అందించినట్లు హెచ్‌ఎం నక్కా రాజేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా కెనరా బ్యాంక్ మేనేజర్ నరేందర్ మాట్లాడుతూ.. విద్యార్థులను ప్రోత్సహించాలనే ఉద్దేశ్యంతో రూ.25 వేలు ప్రైజ్ మనీ అందించటం జరిగిందన్నారు. అనంతరం సర్వరాయ షుగర్స్ కీన్లీ బాటిలింగ్ కంపెనీ వారు ఎస్‌ఎస్‌సీలో సత్తుపల్లి పట్టణంలో అత్యధిక జీపీఏ సాధించిన మాధురి(9.8)కి రూ.15 వేలు, రెండో స్థానంలో నిలిచిన నరేష్‌కు రూ.7,500 ప్రోత్సాహక బహుమతులు అందించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ కృష్ణారెడ్డి, క్వాలిటీ మేనేజర్ దాసు, పుల్లారావు, మార్కండేయులు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎస్.రాజేశ్వరరావు, రవిచంద్ర, ప్రసాద్, రత్నాకర్, రమణమ్మ, జాస్మిన్, పద్మజ, హరిలాల్, కైసర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

టీబీ వ్యాధిపై అవగాహన
కల్లూరు: ప్రతి ఒక్కరూ టీబీ వ్యాధిపై అవగాహన కలిగి ఉండాలని టీబీ నోడల్ పర్సన్ రామారావు, టీబీ చికిత్స సూపర్‌వైజర్ సురేష్‌లు అన్నారు. బుధవారం కల్లూరు పీహెచ్‌సీ వైద్యాధికారి నవ్యకాంత్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ నగర్ ప్రాథమికోన్నత పాఠశాలలోని విద్యార్థులకు టీబీపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. టీబీవ్యాధి నిర్మూలన ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. టీబీ మందులు వాడుతున్న వారికి బలమైన ఆహారం తీసుకోవడం కోసం ప్రతి నెల వారి ఖాతాలో రూ.500 జమ చేయడం జరుగుతుందన్నారు.

సకాలంలో విధులకు హాజరు కావాలి


సమావేశంలో పాల్గొన్న ఎంపీపీ, అధికారులు, ప్రజా ప్రతినిధులు

తల్లాడ: తల్లాడ ప్రభుత్వ ఆస్పత్రి పరిధిలో పని చేస్తున్న వైద్య సిబ్బంది సకాలంలో వారి విధులకు హాజరు కావాలని తల్లాడ ఎంపీపీ దొడ్డా శ్రీనివాసరావు అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో తల్లాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం జన ఆరోగ్య సమితి సమావేశం ఎంపీపీ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీజనల్ వ్యాధులుపై ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. సమావేశంలో ఎంపీడీఓ కొండపల్లి శ్రీదేవి, వైద్యాధికారి రత్నమనోహర్, అల్తాఫ్, పీఆర్ ఏఈ అశోక్, తల్లాడ సర్పంచ్ సంధ్యారాణి, బాలపేట సర్పంచ్ నరసింహారావు, హెల్త్ సూపర్‌వైజర్ పుల్లయ్య, ఏపీఎం శ్రీనివాసరావు పాల్గొన్నారు.

'ఓటు హక్కు'పై అవగాహన


అవగాహన కల్పిస్తున్న అధికారులు

చింతకాని: ఓటు హక్కు వినియోగంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని తహసీల్దార్ రమేష్ తెలిపారు. మండలంలోని పలు గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాల్లో ఈవీఎంల ద్వారా ఓటు హక్కు వినియోగంపై ఓటర్లకు బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఓటు ఎంతో విలువైందని తెలిపారు. 18 సంవత్సరాల వయస్సు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరు నమోదుకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామసర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, గిర్దావర్లు, బూత్ లెవల్ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, పాల్గొన్నారు.

ఓటు వజ్రాయుధం వంటిది..
సత్తుపల్లిరూరల్: పట్టణంలోని నారాయణ స్కూల్‌లో బుధవారం క్యాబినెట్ ఎలక్షన్ నిర్వహించారు. ఇందులో విద్యార్థులు పాల్గొని ఓటు హక్కు వినియోగం, ఎన్నుకొనే విధానంపై ప్రయోగాత్మకంగా అవగాహన కల్పించారు. ఓటు వజ్రాయుధం వంటిదని, తప్పని సరిగా ఓటు వినియోగించుకోవాలని విద్యార్థులకు ప్రిన్సిపాల్ శ్రీనివాసరెడ్డి సూచించారు. కార్యక్రమంలో ఏజీఎం వేణుగోపాల్‌రావు, పొన్నం చంద్ర, సతీష్, ముత్తయ్య, విక్టోరియా, బాలు, పీఈటీ మురళీమోహన్ తదితరులు పాల్గొన్నారు.


మూగజీవాలకు టీకాలు వేయించాలి


కల్లూరురూరల్: పశువుకు టీకా వేస్తున్న వైద్యురాలు

మధిర/కల్లూరురూరల్: మూగజీవాల సంరక్షణకు టీకాలు వేయించాలని సర్పంచ్ జాన్సీ, పశు సంవర్థక శాఖ వైద్యురాలు మమత తెలిపారు. బుధవారం మధిరలోని దేశినేనిపాలెం, అంబర్‌పేట గ్రామాల్లో, కల్లూరులోని చంద్రుపట్ల, ఓబుల్‌రావు బంజరు, విశ్వనాథపురం గ్రామాల్లో నిర్వహించిన ఉచిత పశువైద్య శిబిరాలను ప్రారంభించి మాట్లాడారు. పాడిపశువులు ఆరోగ్యంగా ఉన్నట్లయితే అధిక పాల ఉత్పత్తి సాధ్యమౌతుందని అన్నారు. దీంతో రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందుతారని, టీకాలతో ఎన్నో రకాల వ్యాధుల నుంచి పశువులను కాపాడవచ్చన్నారు. ఈ సందర్భంగా పశువులకు వ్యాది నిరోధక టీకాలు, నులిపురుగుల నివారణ మందులు వేశారు. ఈ కార్యక్రమంలో పశు వైద్య సిబ్బంది రఫీ అహ్మద్, లక్ష్మణరావు, కొండలరావు, రమేష్, భాస్కర్, వెంకటేశ్వర్లు, సాయి చంద్రిక, జాన్‌బీ, కరీమూన్, గోపాలమిత్రలు వలరాజు, సురేష్, అప్పారావు, వెంకటేశ్వర్లు, గోపాలమిత్రలు, రైతులు పాల్గొన్నారు.

19న ఉచిత కంటి వైద్య శిబిరం
పెనుబల్లి: వియంబంజర్ రాజసాయి మందిరం ఆధ్వర్యంలో ఆగస్టు 19న ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకుడు జెన్నారెడ్డి నరసింహారెడ్డి తెలిపారు. పువ్వాడ ఫౌండేషన్ వారి సహకారంతో ఖమ్మం మమత మెడికల్ కాలేజీ మరియు సూపర్ స్పెషాలిటీ హాస్పటల్ వైద్యులతో ఉచిత కంటి వైద్య శిబిరం వీఎంబంజర్ జెడ్పీ పాఠశాల ఆవరణలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందని, ఉచితంగా ఆపరేషన్లు, మందులు అందజేయడతాయన్నారు. కల్లూరు, పెనుబల్లి మండలాల్లోని ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని, మరిన్ని వివరాలకు సెల్ నం. 9866710909, 9963665762 ను సంప్రదించాల్సిందిగా కోరారు.

ఫిజియోథెరపీ సేవలు వినియోగించుకోవాలి


ఫిజియోథెరపీ సేవలు అందిస్తున్న వైద్యురాలు వసంత

చింతకాని: దివ్యాంగ పిల్లల కోసం నిర్వహించే ఫిజియోథెరపీ సేవలను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని ఫిజియోథెరపీ వైద్యురాలు వల్లూరి వసంత తెలిపారు. మండల పరిధిలోని లచ్చగూడెం ఉన్నత పాఠశాల ఆవరణలోని భవిత కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర సమగ్ర శిక్ష అభియాన్ సహకారంతో మండల విద్యాశాఖాధికారి పర్యవేక్షణలో ప్రత్యేక అవసరాలు కలిగిన దివ్యాంగ పిల్లలకు బుధవారం ఫిజియోథెరపీ వైద్యసేవలు నిర్వహించారు. కార్యక్రమంలో ఐఈఆర్పీలు కేఎస్ కృష్ణారావు, భూక్యా దస్లీ, భవిత కేంద్రం సంరక్షురాలు అరికొట్ల లలితకుమారి తదితరులు పాల్గొన్నారు.

దుప్పట్లు పంపిణీ
కల్లూరు: మండలంలోని రిక్షా కార్మికులకు లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో దుప్పట్లు పంపిణీ చేశారు. లయన్స్‌క్లబ్ కల్లూరు జోన్ చైర్మన్, ఖమ్మం జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ కోశాధికారి చలువాది నగేష్‌కుమార్, మమత దంపతుల వివాహ మహోత్సవం సందర్భంగా దుప్పట్లను అందించారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు దారా సురేష్ కార్యదర్శి అప్పలనాయుడు, కోశాధికారి సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు నారాయణరావు, రమేష్, అప్పలనాయుడు, భాస్కర్‌రావు, శ్రీనివాసరావు, అచ్యుతరావు తదితరులు పాల్గొన్నారు.

గొర్రెల యూనిట్లను సద్వినియోగం చేసుకోండి
తల్లాడ: అర్హులైన లబ్ధిదారులు ప్రభుత్వం పంపిణీ చేస్తున్న రెండో విడత గొర్రెల యూనిట్లను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ దొడ్డా శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని గోపాలపేటలో బుధవారం ఎంపీపీ లబ్ధిదారులకు గొర్రెలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో గోపాలపేట సర్పంచ్ మోహన్‌రావు, మండల పశువైద్యాధికారి ఎన్.ఉమాకుమారి, నాగరాజు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం
కల్లూరు: తెలంగాణ ఓపెన్ స్కూల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఓపెన్ ఎస్ఎస్‌సీ, ఇంటర్మీడియట్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కల్లూరు స్టడీ సెంటర్, విజ్ఞాన్ విద్యాలయం కోఆర్డినేటర్ ఎస్‌కే ఇస్మాయిల్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వివిధ కారణాలతో మధ్యలో చదువు మానేసిన వారు, స్కూల్‌కి వెళ్లి చదవలేనివారు కేవలం 5 సబ్జెక్ట్‌లతో 10వ తరగతి, ఇంటర్ ఒకే సంవత్సరంలో పూర్తి చేసే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. అపరాధ రుసుముతో ఈ నెల 31 వరకు ఫీజు చెల్లించవచ్చన్నారు. పూర్తి వివరాలకు విజ్ఞాన్ విద్యాలయం, కోఆర్డి నేటర్, ఎస్‌కే ఇస్మాయిల్, సెల్ నం. 9985835115, 7093554882 ను సంప్రదించాలని కోరారు.

ఉన్నత లక్ష్యాలను ఎంచుకోవాలి
సత్తుపల్లిరూరల్: విద్యార్థులు ఉన్నత లక్ష్యాన్ని ఎంచుకొని కష్టపడి చదవాలని ఎస్ఆర్అండ్‌బీ జీఎన్ఆర్ కళాశాల భౌతికశాస్త్ర అధ్యాపకుడు టి.జీవన్‌కుమార్ అన్నారు. సత్తుపల్లి జేవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ ఆధ్వర్యంలో బుధవారం జరిగిన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. బాల్యం నుంచే క్రమశిక్షణతో చదివితే గమ్యానికి చేరుకోవచ్చన్నారు. అనంతరం కళాశాల సిబ్బంది ఆయనను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ అధికారులు బంగారి, మధు, అధ్యాపకులు రాంబాబు, వినోద్‌కుమార్, రవికుమార్, శ్రీనివాస్, రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

చర్యలు తీసుకోవాలి
కల్లూరు: హెచ్‌ఎంపై దాడికి పాల్పడిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని జిల్లా అటా బాధ్యులు అమర్లపూడి చక్రవర్తి, దంతాల సుధాకర్, కేఏస్ నాయకులు కోరారు. సోమవారం తల్లాడ మండలం బిల్లుపాడు ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకటరామయ్య (అటా జిల్లా అధ్యక్షుడు)పై గత సోమవారం వీరనరసింహారావు తమ పిల్లలకు సరిగా హోం వర్క్ ఇవ్వడం లేదని దాడి చేశాడు. ఈ దాడిని ఖమ్మం జిల్లా టీచర్స్ అసోసియేషన్ తీవ్రంగా ఖండిస్తున్నట్లు పేర్కొంది.

'గృహలక్ష్మి' సర్వే పరిశీలన


గోకినేపల్లిలో సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీఓ అశోక్‌కుమార్

ముదిగొండ: మండలంలోని 25 గ్రామపంచాయతీల్లో 33,812 మంది గృహలక్ష్మి పథకానికి దరఖాస్తు చేసుకోగా, మండలంలోని గోకినేపల్లి, మేడేపల్లి, వెంకటాపురం, ముదిగొండలలో బుధవారం ఎంపీడీఓ అశోక్‌కుమార్ సర్వే ప్రక్రియను పరిశీలించారు. పంచాయతీ కార్యదర్శులు ఇంటింటికి వెళ్లి సర్వే సమగ్రంగా నిర్వహిస్తున్నారా లేదా అని సమగ్ర పరిశీలన కార్యక్రమం చేపట్టారు. అదే విధంగా మండలంలోని బాణాపురం, పెద్దమండవ, కమలాపురం, గండసిరి గ్రామాల్లో ఎంపీఓ సూర్యనారాయణ పరిశీలించారు.

మళ్లీ బీఆర్‌ఎస్‌దే అధికారం


కేసీఆర్ చిత్రపటానికి పాలతో అభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే

వైరా: వచ్చే ఎన్నికల్లో మూడోసారి బీఆర్‌ఎస్ అధికారంలోకి వస్తుందని ఎమ్మెల్యే లావుడ్యా రాములు నాయక్ అన్నారు. బుధవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పంచాయతీ కార్మికులకు జీవిత బీమా రూ.5 లక్షలు ప్రకటించిన సందర్భంగా సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ఏర్పడిన తొమ్మిదేళ్లల్లో రాష్ట్రం ఎంతో అభివృద్ధి సాధించడంతో పాటు అన్ని వర్గాలకు సముచిత న్యాయం కల్పిస్తూ ప్రతి ఒక్కరికి సంక్షేమ పాలన అందించినట్లు వివరించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ ముళ్లపాటి సీతరాములు, ఎంపీపీ వేల్పుల పావని, పసుపులేటి మోహన్‌రావు, సర్పంచులు రామారావు, సత్యప్రసన్నాంభ, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బాల్యవివాహాలు చట్టరీత్యా నేరం


మాట్లాడుతున్న ఏసీడీపీఓ కృష్ణశ్రీ

ఎర్రుపాలెం: బాల్యవివాహాలు చట్టరీత్యా నేరమని ఏసీడీపీఓ కృష్ణశ్రీ అన్నారు. బుధవారం మండలంలోని తెల్లపాలెం గ్రామంలోని పంచాయతీ కార్యాలయంలో స్థానిక సర్పంచ్ రామకృష్ణ అధ్యక్షతన గ్రామస్థాయి బాలల సంరక్షణ నూతన కమిటీ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. అమ్మాయికి 18 సంవత్సరాలు, అబ్బాయికి 21 సంవత్సరాలు నిండిన తర్వాతే వివాహాలు జరిపించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా బాలల సంరక్షణ విభాగం సోషల్ వర్కర్ ఎన్ హరిప్రసాద్, పాఠశాల హెచ్‌ఎం కంచర్ల శ్రీనివాసరావు, అంగన్‌వాడీ టీచర్‌లు కల్యాణి, వసంత, వార్డు సభ్యులు, ఆశా వర్కర్లు, తదితరులు ఉన్నారు.

నియామకాలు..

సత్తుపల్లి యూత్ కాంగ్రెస్ ఎలక్షన్ ఇన్‌చార్జ్‌గా మధు..

మధు

వేంసూరు: సత్తుపల్లి నియోజకవర్గం యూత్ కాంగ్రెస్ ఎలక్షన్ ఇన్‌చార్జ్‌గా కుంచపర్తి గ్రామానికి చెందిన మధుని నియమించారు. ఈ సందర్భంగా గురువారం టీపీవైసీసీ ప్రెసిడెంట్ శివసేవరెడ్డి నియమక పత్రాన్ని మధుకు అందించారు.

వైరా ఇన్‌చార్జ్‌గా ఉపేందర్..

ఉపేందర్

వైరా: వైరా నియోజకవర్గ యువజన కాంగ్రెస్ ఎలక్షన్ ఇన్‌చార్జ్‌గా కొణిజర్ల మండలం పెద్దగోపతి గ్రామానికి చెందిన ఖమ్మం జిల్లా యువజన ప్రధాన కార్యదర్శి నెల్లూరి ఉపేందర్‌ను బుధవారం తెలంగాణ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు శివసేన రెడ్డి నియమించారు.

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా కూసంపూడి..

కూసంపూడి రవీందర్

సత్తుపల్లిటౌన్: బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా సత్తుపల్లికి చెందిన కూసంపూడి రవీందర్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఉత్తర్వ్యూలు జారీ చేశారు. ఈ సందర్భంగా రవీందర్ మాట్లాడుతూ.. పార్టీ సిద్ధాంతం, ఆదర్శలకు అంకితమై నిబద్ధతతో పార్టీ విస్తరణకు కృషి చేస్తానన్నారు. తన నియామకానికి సహకరించిన రాష్ట్ర నేతలకు కృతజ్ఞతలు తెలిపారు.

మధిర నియోజకవర్గ పాస్టర్ల ఫెలోషిప్ నూతన కమిటీ ఎన్నిక
బోనకల్: మండల కేంద్రంలోని క్రీస్తు సంఘం మందిరంలో బుధవారం పాస్టర్స్ ఫెలోషిప్ మధిర నియోజక వర్గ నూతన కమిటీని ఎన్నుకున్నారు. నియోజకవర్గ అధ్యక్షుడిగా వల్లంకొండ దావీదు, ఉపాధ్యక్షుడిగా కొత్తపల్లి జయరాజు, కార్యదర్శిగా కాకర్ల డేవిడ్‌రాజు, ట్రెజరీగా మాలంగి పాల్‌తో పాటు కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సందర్భంగా బ్రదర్ రాజారత్నం మాట్లాడుతూ.. పాస్టర్స్ ఫెలోషిఫ్‌లో సమస్యల పరిష్కారం కొరకు నూతన కమిటీ కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు ఎర్నెస్ట్ పాల్, వైజాక్‌పాల్, డీవీ వరకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం..
ఎన్ఐటీ విద్యార్థినికి పరిశ ట్రస్ట్..
కారేపల్లి: ఎన్ఐటీ తిరుచ్చిలో సీటు సాధించిన పేద విద్యార్థి లకావత్ తరణికి పరిశ సీతారత్నం చారిటబుల్‌ట్రస్టు బుధవారం ఆర్థిక సాయం అందించింది. కారేపల్లి ఉన్నతపాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఎస్సై పి.రామారావు చేతుల మీదుగా అవార్డుతోపాటు రూ.16 వేల నగదును అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ పి.రామారావు, పరిశ సీతారాత్నంచారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకుడు పరిశ పుల్లయ్యలు మాట్లాడుతూ.. పట్టుదల ఉంటే పేదరికం అడ్డు కాదని నిరూపించిన తరుణిని అభినందించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ హెచ్‌ఎం శ్రీదేవి, ఉపాధ్యాయులు శిరీష, కృష్ణకళ, రాణి, జుబేదా తదితరులు పాల్గొన్నారు.

గాయపడ్డ ఫోటో గ్రాఫర్‌కు..
కల్లూరు: ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన కల్లూరుకు చెందిన తేళ్లూరి రాంబాబుకు కల్లూరు మండల ఫోటో అండ్ వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం రూ.8 వేలు ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మద్రాల నాగేశ్వరరావు, మండల అధ్యక్షుడు చల్లా వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి రోజ్‌వేణు, కోశాధికారి డేవిడ్, గౌరవ సలహాదారులు బీవీ, ఉపాధ్యక్షుడు రవి, సహాయ కార్యదర్శి రామారావు, ప్రచార కార్యదర్శి వెంకట్, సలీమ్, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ఫ్రీజర్ బాక్స్ వితరణ
వైరారూరల్: మండలంలోని ముసలిమడుగు గ్రామ పంచాయతీకి చింతనిప్పు కృష్ణార్జున్‌రావు, మాలతి దంపతులు రూ.లక్ష విలువ చేసే ఎలక్ట్రికల్ ఫ్రీజర్ బాక్సును వితరణ చేశారు. ఈ సందర్భంగా ఆ దంపతులను పాలకవర్గం సభ్యులు శాలువాలతో సత్కరించారు. సర్పంచ్ సుధారాణి, మాజీ సర్పంచ్ కరుణాకర్, నాగేశ్వరరావు, మొహిద్దిన్, బాబు, గోపాల్‌రావు, రామకృష్ణరావు, స్వామి పాల్గొన్నారు.

వాలీబాల్ కిట్ల పంపిణీ
కారేపల్లి: కారేపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు కారేపల్లి పోలీసుల ఆధ్వర్యంలో వాలీబాల్ కిట్లను బుధవారం ఎస్సై పుష్పాల రామారావు చేతుల మీదుగా అందించారు. ఈ సందర్భంగా ఎస్సై రామారావు మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు, ఆటల్లోను ముందుండాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సింహాచలం, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి
ఎర్రుపాలెం: కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో పని చేస్తున్న ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.విజయ్ డిమాండ్ చేశారు. బుధవారం మండలకేంద్రంలోని కేజీబీవీ పాఠశాలను ఆయన యూనియన్ మండల కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సూరానేని హనుమంతరావు, ఏ భాష్‌సస్, నాయకులతో కలిసి సందర్శించారు. కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిలర్ ముత్తయ్య, నాయకులు భూషణ్‌రాజ్, సీతారామయ్య, వీరన్న, భాస్కర్, కేజీబీవీ ఉపాధ్యాయులు, సిబ్బంది ఉన్నారు.

రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు
కారేపల్లి: మండలంలోని ఇందిరాక్రాంతి పథం భవనానికి మరియు చేలకు వెళ్లే రహదారిని కొంత మంది వ్యక్తులు జేసీబీతో ధ్వంసం చేశారని.. రైతులు సింగరేణి రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ నరసింహారావుకు ఫిర్యాదు చేశారు. దీంతో స్పందించిన ఆర్ఐ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఈ విషయాన్ని తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఫిర్యాదు చేసిన వారిలో వెంకటేశ్వర్లు, రాందాస్, రామారావు తదితరులు పాల్గొన్నారు.

జాలిముడి కాలువకు మరమ్మతులు చేపట్టాలి


రైతులతో కలసి కాలువను పరిశీలిస్తున్న సీపీఐ బృందం

బోనకల్: మండలంలోని రాపల్లి సమీపంలో ఇటీవల వర్షాలకు తెగిన జాలిముడి పంట కాలువకు మరమ్మతులు చేపట్టాలని సీపీఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం తెగిన జాలిముడి కాలువను సీపీఐ బృందం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాలువ తెగి ఐదురోజులు గడుస్తున్నా ఇరిగేషన్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. దీంతో పలువురి రైతుల భూములు కోతకు గురైవడమే కాకుండా పలు గ్రామాల చెందిన పొలాలకు నీరందక రైతులు నష్టపోతున్నారన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు రామకృష్ణ, రవికుమార్, రాదాకృష్ణ, వేణు, రైతులు పాల్గొన్నారు.